


# టాగోర్ కథలు

తెలుగు సేత: చంద్రలత



# పేరుతో ఆట రవీంద్రనాథ టాగోర్

*నామేర్ ఖేలా,* బెంగాలీ,1921

**1**



చాలా చిన్న వయస్సులోనే అతను కవిత్వం రాయడం మొదలుపెట్టాడు. ఎంతో శ్రమపడుతూ, చాలా శ్రద్ధగా కాగితాల అంచుపై బంగారు సిరాతో చట్రం గీసేవాడు. ఆ చట్రం మీద ఎర్ర సిరాతో పువ్వులు చిత్రించేవాడు. ఆ పూల చట్రం మధ్యలోనే కుదురుగా తన కవితలను రాసేవాడు.

ఆ పై అట్ట మీద ఎంతో ఘనంగా తన పేరు రాసేవాడు —— 'శ్రీ కేదారనాథ ఘోష్.'

ఒకదాని తరువాత ఒకటిగా తన రచనలను పత్రికలకు పంపసాగాడు. ఒకరి తరువాత ఒకరు వాటిని తిప్పిపంపారు. అప్పుడే అతను డబ్బు సమకూర్చుకోగానే, తనే ఒక పత్రికను ప్రచురించాలని నిశ్చయించుకొన్నాడు —— తన స్వంత పత్రిక.

అతని తండ్రి దాటిపోయాక, పెద్దవాళ్ళందరూ అతనికి సలహాలు ఇచ్చారు, పదే పదే —— "ఏదైనా పని చూసుకో. రాతలుకోతలంటూ సమయం వృథా చేసుకోకు!" అని అంటూ.



అలా అనేకమార్లు అన్నప్పుడు, అతను పేలవంగా నవ్వేవాడు. తరువాత తన పని తాను కొనసాగించాడు —— ఒకదాని తరువాత ఒకటి. మూడు పుస్తకాలు అచ్చువేశాడు.

అవి గొప్ప సంచలనాన్ని సృష్టిస్తాయని అతను ఆశించాడు. కానీ, అలా జరగలేదు —— ఏ కొద్దిగానైనా. ఏది ఏమైనా, అవి ఒక పాఠకుడి మనసుని కదిలించాయి.

ఆ పాఠకుడు అతని చిన్న మేనల్లుడు. అప్పుడప్పుడే అక్షరాలు నేర్చుకొంటున్న ఆ బాబు, చేతికందిన ఏ పుస్తకాన్నైనా బిగ్గరగా చదివేస్తుంటాడు. ఒకరోజు ఒక పుస్తకం



చేతబట్టుకొని రొప్పుతూరోజుతూ మామయ్య దగ్గరికి పరిగెత్తుకొచ్చాడు. వగరుస్తూ అన్నాడు —— "చూడు! మావయ్యా, చూడు! ఇది నీ పేరు!"

మామయ్య నీరసంగా నవ్వి,ఆ అబ్బాయి బుగ్గల్ని పుణికాడు.

ఆ తరువాత, పెట్టెలో నుంచి మరొక పుస్తకం తీసి చేతబట్టుకొని అన్నాడు —— "మంచిది. ఇది చదువు!"

మేనల్లుడు మెల్లిగా ఒక్కో అక్షరం కూడబలుక్కుని మామయ్య పేరు చదివాడు. ఒకదాని తరువాత ఒకటి, ఏకంగా మూడు పుస్తకాల మీద మామయ్య పేరుని చదివాక, ఇక ఏ మాత్రం రాజీ పడదలుచుకోలేదు. తన బుజ్జి చేతులు బారచాస్తూ ఆశ్చర్యంగా అడిగాడు ——

"మావయ్యా, నీ పేరు చాలా చాలా పుస్తకాల మీద ఉందా? వందా? నలభై? ఏడు?"

మామయ్య కన్నుగీటి అన్నాడు —— "నువ్వే చూస్తావుగా... రానురాను!"

తన ముసలిదాదికి మామయ్య పేరు చూపించడానికి మేనల్లుడు ఆ మూడు పుస్తకాలను తీసుకెళ్ళాడు —— పరిగెత్తుకొంటూ.

2



ఈ మధ్యన మామయ్య ఒక నాటకం రాశాడు. ఛత్రపతి శివాజి కథానాయకుడు. అతని స్నేహితుడు అన్నాడు, "ఈ నాటకం తప్పక విజయవంతం అవుతుంది." వీధుల్లో, సందుల్లో, గొందుల్లో గోడలన్నీ ఆ నాటకం పోస్టర్లతో నిండిపోవడాన్ని అతని మనసులో ఊహించాడు. వాటన్నిటి మీదా పెద్ద పెద్ద అక్షరాలతో ముద్రించిన నాటకం పేరు, తన పేరు... అతని కళ్ళల్లో మెదులుతోంది.

ఆ రోజు ఆదివారం. నాటకప్రియులైన అతని స్నేహితులు, ఈ నాటకంపై వారి అభిప్రాయం ఏమిటో తెలుసుకోవడానికి, థియేటర్ మేనేజర్‌ని కలవడానికి వెళ్ళారు. వాళ్ళు ఏ కబురు మోసుకొస్తారా అని అతను ఆత్రంగా వీధివంకే ఎదురుచూస్తున్నాడు.

ఆదివారం అతని మేనల్లుడికి సెలవురోజు. తెల్లవారిన దగ్గర నుంచీ ఏదో ఒక ఆటను పుట్టిస్తూనే ఉన్నాడు. పరధ్యానంలో పడిన మామయ్య వాటన్నిటినీ పట్టించుకోలేదు.

3

ఆ అబ్బాయి బడి దగ్గరలో ఒక ప్రింటింగ్ ప్రెస్ ఉంది. అక్కడి నుంచి పేరు రాయడానికి సరిపడేన్ని సీసపు అక్షరాల

అచ్చులను సేకరించాడు. కొన్ని అక్షరాలు చిన్నవి, కొన్ని పెద్దవి. ఈ పూట ఏ పుస్తకం కనబడితే దాని మీద తన పేరును ముద్రించాడు. అలా మామయ్యని ఆశ్చర్యపరచాలని అనుకొన్నాడు. అతను మామయ్యని ఆశ్చర్యపరిచాడు.

మామయ్య వసారాలోకి వచ్చేసరికి, అబ్బాయి ఏదో పనిలో మునిగిపోయి ఉండడం గమనించాడు.

"కనై, ఏం చేస్తున్నావ్?"

మేనల్లుడు పరమ ఉత్సాహంతో తను చేస్తున్న పనిని చూపించాడు. మూడు పుస్తకాల మీద మాత్రమే కాదు, సుమారు పాతిక పుస్తకాల మీద కనై తన పేరును ముద్రించేశాడు.

ఏంటి ఇదంతా? ఆ పిల్లవాడికి పనిమీద ధ్యాస లేదు —— అంతా ఆట. అది ఎలాంటి ఆట?! పేరుతో ఆట!

కనై ఎంతో కష్టపడి కూర్చుకొన్న తన పేరు అచ్చును అతని చేతుల్లో నుంచి మామయ్య గబుక్కున లాక్కున్నాడు. కనై ఆందోళనతో ఏడవడం మొదలెట్టాడు. మొదట సన్నగా వెక్కిళ్లు పెట్టాడు. ఆ తరువాత, బిగ్గరగా, భయంకరంగా, గొంతు చించుకొని ఏడవడం మొదలుపెట్టాడు. ఎంత సముదాయించినా ఊరుకోవడం లేదు.

కనై పెడబొబ్బలు విని, అతని ముసలిదాది పరిగెత్తుకొంటూ వచ్చింది.

"బుజ్జి తండ్రీ, ఏమయింది? కనై బాబు, ఏం జరిగింది?" అని అంటూ.

కనై బెక్కుతూ, రుద్దకంఠంతో బదులిచ్చాడు, "నా పేరు!"


దాది అతని చేతిలో ఒక మిఠాయి ముక్క పెట్టింది. ఆమె పెట్టినంత వేగంగా దానిని విసిరికొడుతూ ఆ బాబు అరిచాడు, "నా పేరు!"

అతని తల్లి వచ్చి బొమ్మని ఇస్తూ అంది, "కనై, ఇదుగో నీ రైలుబొమ్మ."

కనై రైలుబొమ్మను దూరంగా నెట్టేసి, బిగ్గరగా గుక్క పట్టి ఏడ్చాడు, "నా పేరు!"

4

ఇంతలో మామయ్య స్నేహితుడొకడు నాటకశాల నుంచి తిరిగివచ్చాడు.



మామయ్య ఒక్క పరుగున వాకిట్లోకి ఎదురెళ్ళాడు, "ఏం వార్త తెచ్చావ్ రా?" అని అంటూ.

అతని స్నేహితుడు బదులిచ్చాడు, "వాళ్ళు దానిని వద్దన్నారు."

చాలా సేపు నిశ్శబ్దం తరువాత మామయ్య అన్నాడు, "నేను పూర్తిగా దివాలా తీసినా సరే, నా స్వంత నాటక సమాజాన్ని మొదలు పెడతా!"

అతని స్నేహితుడు అడిగాడు, "ఇవ్వాళ ఫుట్‌బాల్ మ్యాచ్ ఉందిగా, వస్తున్నావా?"

"లేదు. నాకు జ్వరం వచ్చినట్లుగా ఉంది."

ఆ మధ్యాహ్నం అతని అమ్మ వచ్చి అంది, "భోజనం చల్లారిపోతోంది."

చీకటి పడ్డాక అతని భార్య వచ్చి అడిగింది, "ఇవ్వాళ మీ కొత్త కథ చదివి వినిపిస్తున్నారా?"

"నాకు తలనొప్పిగా ఉంది," అన్నాడు అతను.

ఇంతలో మేనల్లుడు వచ్చి ఉక్రోషంగా అన్నాడు,

"నా పేరు నాకిచ్చేయ్!"

అతని మేనమామ దిమ్మ తిరిగే లెంపకాయ ఇచ్చాడు!

★

**అనుసృజకుల వ్యాఖ్యానం**

అచ్చులో తమ పేరు చూసుకోవాలని ఎవరికి ఉత్సాహముండదు? ఆ ఉబలాటం కాస్తా మితిమీరి పేరుకండూతిగా, ఆపై ఇంకాస్త ముదిరి కీర్తికాంక్షగా పరిణమిస్తుంది. అలా పేరు కోసం హఠం వేసే బోలుమనుషులపై ఎంతో చమత్కారంగా, సునిశిత హాస్యంతో టాగోర్ వేసిన చురక ఈ *నామేర్ ఖేలా* (పేరుతో ఆట, 1921) కథ.

చేసే పనిలో సామర్థ్యాన్ని సాధించకుండా, కౌశల్యాన్ని మెరుగుపరుచుకోకుండా, ప్రమాణాన్ని ఉన్నతీకరించుకోడానికి ప్రయత్నించకుండా, తాము చేసిన గోరంత పనిని కొండంత ఘనకార్యంగా భావించే వారందరూ ఈ కథ చదవగానే భుజాలు తడుముకోవాల్సిందే.

ఇంతకీ, ఈ కథలో పేరుతో ఆట ఆడుతున్నది ఎవరు? మేనల్లుడా? మామయ్యా?

**References:**


1. Play of Names, Lipika, Translated by Aurobindo Bose, 1977
2. *namer-khela* https://www.tagoreweb.in/Stories/lipika-147/namer-khela-136
3. *namer-khela* https://www.youtube.com/watch?v=nZhgs3NlPCg&t=3s
4. *Namer Khela – Rabindranath Tagore* | Audio Story — https://www.youtube.com/watch?v=KZc5BY9buHQ


★★★

COMMENTS